



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# టంగుటూరి సూర్యకుమారి

## మూడవ భాగం



**అతి చిన్నవయసులోనే అద్భుతమైన గాయనిగా పేరు తెచ్చుకొని, స్వాతంత్ర్య సమర గాయనిగా తన ప్రతిభను ప్రభావాన్ని చూపించి నటిగా,గాయనిగా,నర్తకిగా , రంగస్థల నాటక రూపకర్తగా పేరు తెచ్చుకొని విదేశాల్లో భారతీయ సంగీతాన్ని, కూచిపూడి నాట్యాన్ని , భరత నాట్యాన్ని కూడా ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో విశేషమైన కృషి చేసిన తొలితరం తెలుగు కళాకారుల్లో ప్రథమ పంక్తిలో నిలచే స్వర్గీయ టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన ప్రత్యేక కార్యక్రమం మూడవ భాగం ఈ రోజు.**

*మొదటి రెండు భాగాల్లో ఏం మాట్లాడుకున్నామో అతి క్లుప్తంగా గుర్తుకు తెచ్చుకుని తర్వాత ఈ నాటి విశేషాల్లోకి వెళదాం. మా తెలుగు తల్లికి మల్లెపూదండ గాయనిగా తెలుగువారందరికీ చిరకాలం గుర్తుండే స్వర్గీయ టంగుటూరి సూర్యకుమారిగారు, టంగుటూరి ప్రకాశం పంతులు గారి తమ్ముడు గారి అమ్మాయి. 1925 నవంబర్ లో జన్మించారు. ఆమె తన పన్నెండవ ఏటనే అంటే 1937 లో సినీరంగ ప్రవేశం*

*చేసి, అటు నటిగాను, ఇటు గాయనిగాను కూడా ఎదుగుతూ వచ్చారు. సినిమాల్లో పాత్రలకంటే 1940 –1960 ఆ ఇరవై ఏళ్ళల్లో లలితగీత గాయనిగా అద్భుతమైన పేరు తెచ్చుకున్నారు. ఆ రోజుల్లో ఆమె పాటల గ్రామఫోన్ రికార్డులు వేలాదిగా అమ్ముడుపోతూ ఉండేవి. వాటి ప్రచారం కోసం చేసిన చిత్రాలు, పత్రికా ప్రకటనలు గమనిస్తే, అదేదో పెద్ద తారల సినిమా విడుదలకి ఎంత ప్రచారం చేసేవాళ్ళో టంగుటూరి సూర్యకుమారి గారి గ్రామఫోన్ రికార్డుల విడుదలకు కూడా అంత విశేషంగా ప్రచారం చేస్తుండేవాళ్ళు ఆ రోజుల్లో. 1952 లో మిస్ మద్రాస్ గా కూడా ఎంపికయ్యారు.1952 లోనే అమెరికా పర్యటనకు వెళ్లినటువంటి తొలి తెలుగు నటీమణి, తొలి తెలుగు అమ్మాయి కూడా అయ్యారు. హాలీవుడ్ పర్యటనకి వెళ్లి వచ్చాక హిందీ సినిమాల్లో కూడా నటించారు. ఆమె నటించిన చివరి తెలుగు చిత్రం భక్తరామదాసు. దాదాపుగా 25 సినిమాల్లో తెలుగు, తమిళం హిందీ కలుపుకొని నటించారు. 1956లో వాళ్ళ అమ్మగారు మరణించారు. వాళ్ళ నాన్నగారైతే అంతకి ఏడెనిమిది సంవత్సరాల కిందటే మరణించారు. వాళ్ళమ్మగారు మరణించాక సినిమాలు, గ్రామఫోన్ రికార్డుల కంటె కూడా భిన్నమైన సాంస్కృతిక కార్యక్రమ ప్రయోగం చేయాలన్న ఉద్దేశ్యంతో 1956 ,57 ప్రాంతాల్లో కళాచైతన్య అనే సంస్థను స్థాపించారు. ఇంతవరకూ కిందటి రెండు వారాల్లో మాట్లాడుకున్నాం. మిగతా విశేషాలు ఇక్కడినుంచి కొనసాగిద్దాం.*

కళాచైతన్య అనే సంస్థ తరపున సూర్యకుమారిగారు చేయదలుచుకున్న ప్రత్యేక ప్రయోగం ఏమిటంటే, ఒక నృత్య నాటికని రంగస్థల ప్రదర్శనగా తీర్చిదిద్దడం. ఆ నృత్య నాటికకి కథాంశాన్ని ఎంచుకునేటప్పుడు ఆమెకి చిన్నతనం లో వాళ్ళ నాన్నగారు పరిచయం చేసిన రవీంద్రనాథ ఠాగూర్ పుస్తకాలు గుర్తొచ్చాయి. వాళ్ళ నాన్నగారి ప్రభావం వల్లే చిన్నప్పటినుంచి కూడా ఇంగ్లీష్ నవలలు, ఇంగ్లీష్ నాటకాలు ఎక్కువగా చదువుతూ ఉండేవాళ్ళు. రవీంద్రనాథ ఠాగూర్ రాసిన చిత్ర అనే ఓ నాటకాన్ని ఆవిడ ఎంపిక చేసుకుని, దాన్ని తెలుగులోకి అనువాదం చేసి నృత్య నాటికగా తీర్చి దిద్దుదాము అనే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ చిత్ర నే తెలుగు లో చిత్రార్జున అయ్యింది. అంటే చిత్రాన్గద, అర్జునుడు వాళ్ళిద్దరికీ సంబంధించిన కథ. దీన్ని తెలుగులో వ్రాయడానికి ఎవరు దొరుకుతారు అని ఆవిడ అన్వేషించడం ప్రారంభించారు 1957 మొదట్లోనే. ఆవిడకి ఎవరో సలహా ఇచ్చారు "ఒక మంచి కుర్రవాడు కె.వి.రెడ్డి గారి దగ్గర సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అతనైతే బాగా వ్రాయగలడు" అని. ఆ కుర్రవాణ్ణి పిలిపించారు. ఆ కుర్రవాడి వయసు అప్పట్లో 25 ,26 సంవత్సరాలుంటుంది. ఆయన ఈ చిత్ర అనే రవీంద్రనాథ్ నాటకాన్ని తెలుగులో చిత్రార్జున అనే పేరుతో నృత్య నాటకంగా వ్రాయడానికని రోజు సూర్యకుమార గారి ఇంటికి వెళ్లి ఉదయం నుంచి సాయంకాలం వరకు అక్కడ కూర్చుని, ఆవిడతో చర్చించి వ్రాస్తూ ఉండేవాడు. దానికి మాటలు పాటలు కూడా ఆయనే వ్రాశారు. ఆ కుఱ్ఱవాడెవరో కాదు ఇప్పుడు 86 సంవత్సరాల వయసున్న సింగీతం శ్రీనివాసరావు గారు. అప్పట్లో ఆయన మాయాబజార్ చిత్రానికి కె.వి.రెడ్డి గారి దగ్గర సహాయకుడిగా పనిచేశారు. అయిపోయిందనుకుంటాను. సుమారుగా ఆ రోజుల్లోనే సూర్యకుమారి గారితో కలిసి ఈ నాటకం వ్రాయడానికి కూర్చున్నారు సింగీతం శ్రీనివాసరావు గారు. సింగీతం శ్రీనివాసరావు గారికి మరొక సహాయకుడిగా ఇంకో కుర్రాణ్ణి ఇచ్చారు టంగుటూరి సూర్యకుమారి గారు. "ఈ కుర్రవాడు మీకు సహాయకుడిగా ఉంటాడు ఏమన్నా కావాలంటే చేసిపెడతాడు" అని. ఆ కుర్రవాడు తర్వాతి రోజుల్లో సినీ నటుడు అయినటువంటి విజయచందర్ గారు, సూర్యకుమారి గారి అక్కయ్యగారి అబ్బాయి. ఇదంతా కొన్ని వారాలపాటో, రెండు మూడు నెలలపాటో జరిగింది.

ఆ విశేషాలన్నీ కూడా చెబుతూ సింగీతం శ్రీనివాసరావు గారు ఒక చక్కటి వ్యాసాన్ని రాశారు, టంగుటూరి సూర్యకుమారి గారి గురించి నటువంటి ప్రత్యేక పుస్తకంలో. రోజూ పొద్దున్నే వెళ్లి ఆ సంభాషణలు రాశాక ఆయన చెపుతూ ఉండేవాళ్ళట. "ఒక దృశ్యం మొత్తం అయిపోయాక చదవండమ్మా మీరు" అని. అప్పటికే టంగుటూరి సూర్యకుమారిగారు చాలా ప్రసిద్ధి చెందినట గాయని, నటీమణి కూడాను. సింగీతం శ్రీనివాసరావు చాలా కుర్రవాడు. అప్పుడే ఆయన సినిమాల్లో సహాయ దర్శకుడిగా వెళ్లారు. అయితే సూర్యకుమారి గారు ఆగలేక ఈయన రెండు మూడు సంభాషణలు రాయగానే వెంటనే చదివి మళ్ళా వాటిని అభ్యాసం చేసి వాటిని ఎలా ఉచ్చరిస్తే బాగుంటుంది అనుకొని.. అలా చేస్తూ ఉండేవాళ్ళట. పాటలు వ్రాసినప్పుడు కూడా ఈయన పాటలు ఒక చరణం వ్రాయగానే వెంటనే ఆవిడ లోపలికెళ్ళి సంగీత పరికరాల దగ్గర కూర్చుని దానికి శృతి లయలు అనుకొని దానికి కూడా ట్యూన్ చేసి.. ఇలాంటివన్నీ వెంట వెంటనే చేసేస్తూ ఉండేవాళ్ళట.

దానిలో నటీనటుల ఎంపిక గురించి అన్వేషణ ప్రారంభమైంది. దాదాపుగా పాతిక మంది కావాలి. కొంచెం నృత్యం తెలిసిన వాళ్ళు కానీ , ఇలాగ పాటలకి అభినయం చేసేవాళ్ళు కావాలి. వెతకడం ప్రారంభించారు. ముఖ్యంగా ప్రధాన పాత్ర అయినట అర్జునుడు. చిత్రాన్గద పాత్రేమో సూర్యకుమారి గారు వేస్తారు. ఆవిడ పక్కన అర్జునుడి పాత్ర వేయాలంటే, ఈవిడ ఎత్తు కి సరిపోయినటువంటి నటుడు కావాలి. చాలామందిని చూశారు. ఎవరూ కూడా ఆమె

పక్కన నటించేటటువంటి స్థాయికి కనిపించలేదు. అదే సినిమాల్లో అయితే కెమెరా ఉంటుంది కాబట్టి ఎలాగో లాగా వాళ్ళు సర్దుతారు ఎత్తు పెద్ద సమస్యగా ఉండేది కాదు.ఇది రంగస్థలమయ్యేసరికి , ఈ రంగస్థలం మీద కెమెరా ఉండదు కదా! ప్రేక్షకులు చూస్తూ ఉంటారు అందుకని సరిగ్గా ఈవిడ ఎత్తుకు సరిపోయినటువంటి కుర్రవాడు కావాలి, అర్జునుడిగా నటించడానికి. అన్వేషణలో ఒకసారి మద్రాస్ లో వుడ్ ల్యాన్డ్ హోటల్ కి వెళ్లారు సింగీతం శ్రీనివాసరావు గారు, సూర్యకుమారి గారు మరికొందరు. అక్కడ పార్టీలో ఒక కుర్రవాణ్ణి చూశారు. ఆయన చాలా ఎత్తున్నాడు సరిగ్గా ఈ అర్జునుడి పాత్రకు సరిపోతాడు అనుకొని ఆయనను సంప్రదించారు. ఆయన అప్పట్లో డిటెక్టీవ్ అనేటటువంటి మాసపత్రికకి సంపాదకుడిగా పనిచేస్తున్నారు. ఆయన పేరు వై.వి.రావు. తర్వాత రోజుల్లో ఈ వై.వి.రావు గారే కృష్ణ గారి తో 'పగసాధిస్తా'.' టక్కరిదొంగ చక్కని చుక్క' ఇలాంటి సినిమాలు తీసినటువంటి నిర్మాత అయ్యారు. ఆ వై.వి.రావు గారిని, ఆయన పర్సనాలిటీ అదీ చూసి ఆయనను అడిగారు నాటకంలో నటించడానికి ఆసక్తి ఉందా? అని. " సూర్యకుమారిగారి పక్కన నటించడమంటే అంతకంటే కావాల్సినదేముంటుంది , పైగా నేను కూడా నటించేటటువంటి అవకాశం కొరకు చూస్తున్నాను" అని ఆయన వెంటనే ఒప్పుకున్నారు. ఆ విధంగా వై.వి.రావుగారు అర్జునుడి పాత్ర కి ఎంపికయ్యారు. ఆయన ఒకసారి ఈ నాటక ప్రదర్శనలోకి వచ్చాక ఆ డిటెక్టీవ్ పత్రికలోనే బొమ్మలు వేసే పి.ఎన్.మీనన్ అనే ఆయన్ని ఈ నాటకానికి కళా దర్శకుడిగా తీసుకున్నారు. ఈ పి.ఎన్.మీనన్‌నే తర్వాతి రోజులలో పెద్ద మలయాళీ దర్శకుడయ్యారు. ఇందులో రాసిన పాటల్లో ఒక రాగమాలిక ఉంది. అంటే, ఋతువులన్నీ కూడా ఎలాగ మారుతుంటాయి ఏమిటి అంటూ వాటిని వర్ణించడానికి. దాన్ని అభినయయించడానికి ప్రసిద్ధ నర్తకి యామినీ కృష్ణమూర్తి గారిని ఎంపిక చేసుకున్నారు. ఆ విధంగా ఏర్పాట్లన్నీ పూర్తయి నటీనటుల ఎంపిక కూడా పూర్తయ్యాక , దానికి సంబంధించినటువంటి అభ్యాసము, రిహార్సిల్స్ కొన్ని వారాలపాటు జరిగింది.

25 మందితో నాటకాన్ని వేయించడమంటే,అంత సాధారణమైనటువంటి విషయమేమీ కాదు. పైగా అది నృత్య నాటకం. దానికి సంగీతము, అలాగే వీళ్ళందరికీ కూడా నేర్పడము, పైగా తన పాత్రను తను చూసుకోవడము ఇవన్నీ కూడా ఒక కొత్త రకమైన అనుభవాన్ని ఇచ్చాయి సూర్యకుమారి గారికి. .ఆ రోజుల్లో సూర్యకుమారి గారితో కలిసి పనిచేసిన సింగీతం శ్రీనివాసరావుగారు ఆవిడ ఎలా వుండేవాళ్ళు అందానికి కొన్ని విశేషాలు చెప్పారు. "ఎంత హడావుడి పనులున్నా , ఎంత గందరగోళ పరిస్థితులైనా, ఎంత సంక్లిష్ట సమస్యలైనా కానీ సూర్యకుమారి గారు ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాళ్ళు , ఆవిడ ఎవరితోటి కూడా పరుషంగా మాట్లాడేవాళ్ళు కాదు.. అంత సున్నితమైనటువంటి మనస్తత్వం ఆమె ఒకసారి నవ్వడం చూస్తే మన చుట్టూ ఉన్నటువంటి సమస్యలన్నీ కూడా మాయమై పోయాయేమో అన్నట్లుగా ఉండేది. అంత మంచితనం తోటి కాస్త అమాయకత్వం కూడా ఉండేది ఎవర్ని బడితే వాళ్ళను నమ్మేస్తూఉండేవాళ్ళు . నేను చెప్పాను అమ్మా ఇలాగ అందర్నీ నమ్మితే గనక సమస్యలొస్తాయేమో నని.దానికి కూడా ఆవిడ ఒక చిరునవ్వు నవ్వేసి ఊరుకుంన్నారు" అని సూర్యకుమారి గారి మనస్తత్వాన్ని దగ్గరగా పరిశీలించిన సింగీతం శ్రీనివాసరావు గారు చెప్పారు.

ఆ విధంగా నాటక అంతా పూర్తయింది . తర్వాత దాని ప్రదర్శన 1957 సెప్టెంబర్ లో. హైదరాబాద్ లో మొట్టమొదటిసారి గా జమ్రుద్ మహల్ లో ప్రదర్శించడానికని ఏర్పాట్లన్నీ చేశారు. ఈ నాటకం గురించినటువంటి ఏర్పాట్లు, దీని గురించిన అభ్యాసం.. ఇవి జరుగుతున్న రోజుల్లోనే టంగుటూరి ప్రకాశం పంతులు గారు మరణించారు. అంటే సూర్యకుమారి గారు ఈ నాటక ప్రదర్శనకి ప్రారంభించి శ్రీకారం చుట్టి ప్రారంభించి దీన్ని ప్రదర్శిద్దాము అని అనుకునే సమయానికి వాళ్ళమ్మగారు, నాన్నగారు, పెదనాన్నగారు కూడా ఈ లోకంలో లేరు. 1957 సెప్టెంబర్ లో ఆ హైదరాబాద్ లో దీన్ని ప్రదర్శించినప్పుడు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారు వచ్చారు. 25 మంది నటీనటుల బృందం. ఆ రోజు సూర్యకుమారి గారితో పాటుగా కలిసి , ఆ రంగస్థల అలంకరణ చేసి, తర్వాత వాటినన్నింటిని శుభ్రం చేసి నటువంటి వాళ్ళల్లో ఉన్న వ్యక్తి సూర్యకుమారి గారి అక్కయ్య గారి అబ్బాయి బాబు గారు. ఆయన శాన్ ఆంటోనియో లో ఉన్నారు, 80 సంవత్సరాల వయసు. ఆయన కూడా చెప్పారు ఆ రోజు నాటక మొదలౌతుంటే ఎక్కువమంది రాలేదట. "పెద్దక్కా,. ఎక్కువ మంది రాలేదు, ఫర్వాలేదా నాటకం అవుతుందా?" "ఏం పర్వాలేదు లేరా ! వస్తారు లేరా!" అని అన్నారుట ఆవిడ. నాటకమైతే వేయడం వరకు ప్రదర్శన అద్భుతంగా జరిగింది కాకపోతే, ప్రేక్షకులు మాత్రం అట్టే రాలేదు. అయితే సూర్యకుమారి గారికి చక్కటి అనుభవం వచ్చింది – పాతిక మంది తోటి ఈ నాటకం వేయించడము,. వాళ్ళందరిని సిద్ధం చేయించడము , తెరలు కట్టడము, అలాగే రంగస్థలము ఇలాంటి వాటన్నింటిలోనూ. నీలం సంజీవరెడ్డి గారు ఈ నాటకం అయిన మరునాడు సూర్యకుమారి గారికి ఓ చక్కటి ఉత్తరం రాశారు. "చాలా బాగా చేశావమ్మా! చక్కటి నాటకం ఇది. అయితే దీన్ని ఇంతటితో ఒక్క ప్రదర్శనతోటె ఆపకుండా దీన్ని వరుసగా ప్రదర్శనలు కొనసాగిస్తే బావుంటుంది" అని. ఆ

మరునాడు వచ్చినటు దక్కన్ క్రానికల్ లో కూడా ఈ నాటక ప్రదర్శన , ఇది విజయవంత మవ్వడం(విజయవంతమవడం అంటే ప్రదర్శన పరంగా) గురించి ప్రముఖంగా ఒక వార్తకూడా రాశారు.

ఆ విధంగా సూర్యకుమారి గారి నటన, గాయని, జీవితంలో ఓ కొత్త ప్రకరణం ఆరంభమైంది. అదే ఈ రంగస్థల నాటకాన్ని రూపొందించి ప్రదర్శించడం అనేది. తర్వాత సూర్యకుమారి గారి గురించి మాటాడుకోబోయే ముందు సింగీతం శ్రీనివాసరావు గారు చెప్పిన విశేషాలు చెపుతాను. "ఆ తర్వాత ఎక్కువగా మళ్ళీ సూర్యకుమారి గారిని కలిసే అవసరం రాలేదు. ఒక్క సారో, రెండు సార్లో తప్ప. ఆవిడ భారతదేశాన్ని వదిలి వెళ్ళాక అయితే అసలు కలుసుకోలేదు. మళ్ళా ఒకసారి మద్రాస్ వచ్చినప్పుడు నాగురించి అడిగారట. నేనేమో ఏదో సినిమాల్లో బయటికి వెళ్లాను.అందువల్ల ఆవిడను మళ్ళీ కలుసుకోలేకపోయాను"

అప్పుడు సూర్యకుమారి గారు దాన్ని వెంటనే ఆపడం ఇష్టం లేక ఢిల్లీ లో మూడు రోజుల ప్రదర్శనల్ని ఏర్పాటు చేశారు. ఈ ఒక్క నాటక కాకుండా ఆవిడ నాట్యము, అలాగే ఆవిడ పాటలు వీటన్నింటి తోటి మూడు రోజుల పాటు కళా సాంస్కృతిక కార్యక్రమ పరంపర లాగా ఏర్పాటు చేశారు. దానికి అప్పటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ , అలాగే రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, కమాండర్ ఇన్ చీఫ్ జనరల్ తిమ్మయ్య గారు కూడా ఆహ్వానించారు సూర్యకుమారి గారు. సూర్యకుమారి గారికున్న పేరు, ప్రతిష్ట , పరపతి తోటి ఆవిడ నిర్వహించినటువంటి మూడు రోజుల న్యూ ఢిల్లీ కార్యక్రమానికి వాళ్ళు ముగ్గురూ కూడా వచ్చారు. .ఆ మూడు రోజుల కార్యక్రమంలో ఒక రోజు ఈ చిత్రార్జున నాటకాన్ని ప్రదర్శించారు.25 మంది నటీ నటుల బృందాన్ని, సాంకేతిక నిపుణుల్ని తీసుకుని ఆవిడ ఢిల్లీ వెళ్లి వాళ్లందరికీ వసతులు కల్పించడం ఇవన్నీ కూడా ఆవిడే చూసుకొని ఆ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు.ఆ మూడు రోజుల ప్రదర్శనలో ఒక రోజు జరిగినటువంటి ప్రదర్శనకి వచ్చినటువంటి ఆ ఆదాయాన్ని ప్రధానమంత్రి విరాళ నిధి కి ఇచ్చారు సూర్యకుమారి గారు. సంజీవరెడ్డి గారు ఎలాగైతే ఈవిడ నాటకాన్ని హైదరాబాద్ లో చూసి చాలాబాగుందనిచెప్పి ఆయన ఎలాగైతే కితాబిచ్చారో,ఢిల్లీ లో ఈ ప్రదర్శన జరిగాక ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ గారు కూడా సూర్యకుమారి గారికి చక్కటి ప్రసంశా పత్రము ఇచ్చారు. చాలా బాగా చేశావు ఈ నాటకాన్ని నీ ప్రతిభ గురించి వేరే పొగడాల్సిన పనిలేదు అని. చాలామంది అనుకున్నారు ప్రధానమంత్రి గారు కూడా ప్రత్యేకంగా వెళ్లారు ఈ కార్యక్రమానికి.. బహుశా సూర్యకుమారి గారికి రాజ్యసభ సభ్యత్వం ఇస్తారేమో అని . ఎందుకంటే, కళాకారుల□□, రచయితల□□ గౌరవించి రాజ్యసభ సభ్యులుగా చేయడం ఆనవాయితీ గా ఉండేది. ఆ రోజుల్లోనే అమితాబ్ బచ్చన్ గారి నాన్నగారు హరివంశ రాయ్ బచ్చన్ గారు కూడా రాజ్యసభకి సభ్యుడుగా ఎంపికయ్యారు 1956 లోనే. సూర్యకుమారిగారి విషయంలో అలాంటిదేమీ జరుగలేదు. సూర్యకుమారి గారు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే ఆవిడ ఆశించలేదు పదవి కావాలని.

సూర్యకుమారి గారు మామూలుగా వెనక్కొచ్చేసి మళ్ళా ఆవిడ కార్యక్రమాల్లో ఉన్నారు. ఈ చిత్రార్జున నాటకాన్ని ఆంధ్ర దేశంలో మిగతా చోటల్లో ప్రదర్శించలేదు కానీ ఢిల్లీ వెళ్లి వాళ్ళతో ప్రదర్శన ఇప్పించాక ఆవిడకి కొత్త రకమైనటువంటి ఆలోచన వచ్చింది. ఈ నాటకాన్ని తరువాతి స్థాయికి తీసుకువెళ్ళాలి అంటే అప్పట్లో కొత్తగా వస్తున్నటువంటి టెలివిజన్ కి తీసికెళ్తే గనక చాలా బావుంటుంది. మరి అలా తీసికెళ్లాలంటే భారతదేశంలో కంటే కూడా విదేశాల్లో కెళితే బావుంటుంది అనే ఆలోచన ఆవిడకొచ్చింది. ఆలోచన రావడం పరవాలేదు కానీ, 35 సంవత్సరాల అమ్మాయి ఆ భారతదేశంలోనే ఎంతో పేరు తెచ్చుకొని, ఆవిడకి అప్పుడు పాటకచేరీలు చేయాలన్న ఆవిడకి బోలెడు అవకాశాలుండేవి. అలాంటి రోజుల్లో కూడా ఈ కొత్త ప్రయోగం చేయాలి, విదేశాల్లో దీన్ని టెలివిజన్ కి అలాంటి దానికి తీసికెళ్ళి,తర్వాతి స్థాయికి తీసికెళ్ళాలి అనే ఆలోచన రావడం చాలా ప్రత్యేకమైనటు పరిస్థితి. వాళ్ళమ్మగారు ఎపుడూ చెబుతూ ఉండేవాళ్ళట. "నువ్వు గుర్తుపెట్టుకో! నీ ఇష్టమైన పని ఉంటె గనక మనసు పెట్టి చేస్తే,ఏ రంగం లో నైనా సరే నీవు రాణించగలవు, మిగతావాళ్ళని అధిగమించగలవు" అని. అదే మాటను గుర్తుబెట్టుకుని ఈ టెలివిజన్ తీసికెళ్ళాలి అని అనుకున్నప్పుడు ఆమె భారతదేశం దాటి విదేశాలకి వెళ్లి అక్కడ ప్రయత్నాలు చేయాలి అనుకున్నారు.

ఆలోచన వచ్చిందే తడవుగా 1958 వ సంవత్సరం మొత్తం ఆవిడ పూర్తిగా విదేశాలకి ఎలా వెళ్ళాలి అనే అవకాశాల గురించి అన్వేషించడం, పరిశోధించడం అలాగే రకరకాల మనుషుల్ని సంప్రదించడం చేశారు. ఆమెకి అప్పటికే ఉన్నటువంటి పేరు ప్రతిష్టల్ని బట్టి చాలామంది పరిచయాలు ఉంటూఉండేవి. అప్పటికే ఒకసారి హాలీవుడ్ కి వెళ్లి వచ్చారు. హాలీవుడ్ వెళ్లి వచ్చాక హిందీ సినిమాల్లో వేషాలు వేసే రోజుల్లో హిచ్ కాక్, ఆయన భార్య కూడా బొంబాయి వచ్చినప్పుడు ప్రత్యేకంగా సూర్యకుమారి గారి ఫ్లాట్ కి వచ్చి కొద్ది గంటలు కూర్చొని వెళ్లారు. ఆ సందర్భంలో హిచ్ కాక్ భార్య గారి

తోటి సూర్యకుమారి గారికి చక్కటి స్నేహం కూడా ఏర్పడింది. ఇంకా సూర్యకుమారి గారికి పరిచయమున్న వాళ్ళందరూ కూడా అప్పటికి న్యూయార్క్ లోని ,యునైటెడ్ నేషన్స్ లోనూ వరల్డ్ బ్యాంకు లోనూ ఇలాంటి చోట్ల పనిచేస్తూ ఉన్నారు. వాళ్లందరినీ కూడా సంప్రదించారు సూర్యకుమారి గారు 1958 వ సంవత్సరంలో.

మొత్తానికి ఎలాగైతే 1959 వచ్చేసరికి ఆవిడ ప్రయత్నాలన్నీ కూడా ఒక కొలిక్కి వచ్చినాయి. హిచ్ కాక్ సూర్యకుమారి గారికి "మీరు రండి! పరిశోధకురాలిగా నేనొక అవకాశం ఇవ్వగలను.నటిగా ఇవ్వలేను. నేను ఒక టి.వి. సీరీస్ చేస్తున్నాను. ఆ టి.వి.కథలకి కావాల్సిన పరిశోధన చేసి మీ భారతదేశానికి సంబంధించి న ఇతిహాసాలు , పురాణాలు వాటిల్లో ఉన్న కథలు అలాంటి వేమైనాసరే . కానీ మీరు న్యూయార్క్ లో ఉండాలి మీకు నేను పారితోషికమిస్తాను" అని రాయడం తోటి సూర్యకుమారి గారి ప్రయత్నంలన్నీ ఒక కొలిక్కి వచ్చి ఆవిడ 1959 లో అమెరికా కి ప్రయాణం కడదామని అనుకున్నారు. అప్పటికి ఇంకా ఆమెకి వివాహం కాలేదు. అంతవరకూ ఆవిడతో పాటుగా చేదోడు వాదోడు గా ఉండి, ఆవిడ ఎక్కడకు వెళ్లినా సహాయకురాలిగానూ చాలా ఆత్మీయురాలిగానూ ఉన్నటువంటి వాళ్ళ అక్కయ్యగారి అమ్మాయి అనసూయ గారని ఆవిడ వివాహం కూడా సూర్యకుమారి గారు పూర్తి చేశారు సూర్యకుమారి గారి ఇంట్లోనే. వాళ్ళ అన్నయ్యలిద్దరూ వాళ్ళిద్దరికీ వివాహం కాలేదు. వాళ్లకు కూడా ఏమాత్రం ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా ఉండేటటువంటి ఏర్పాట్లు చేశారు. సూర్యకుమారి గారు ఇలాగా అమెరికా వెళదామనుకుంటున్న రోజుల్లో కొంచెం అటు – ఇటుగా వాళ్ళక్కయ్యగారు మిగతా అన్నయ్యలు కూడా హైదరాబాద్ కి మకాం మార్చారు.

1959 మార్చ్ న సూర్యకుమారి గారు అమెరికా కి ప్రయాణం కట్టారు. ఒక్కసారి ఆ పరిస్థితిని ఊహించుకుంటే – రంగస్థల నాటకాన్ని టెలివిజన్ కి తర్వాతి స్థాయి కి తీసికెళ్ళడానికని అమెరికా వెళ్లాలనుకున్నారు. మరి నిజంగా ఇంకేమైనా అసంతృప్తి వెంటాడిందా?లేకపోతే,ఈ కార్యదీక్ష ముందుకెళ్లి నడిపించిందో కానీ సూర్యకుమారి గారు తన 35 సంవత్సరాల వయసులో బంధువర్గానికి , మిత్ర బృందానికి అంతవరకూ సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతులకు అతిదూరంగా వెళ్లిపోయి జీవితాన్ని పునర్నిర్వచించుకోవడానికి ,సరికొత్త భవిష్యత్తును నిర్మించుకోవడానికి వేలాది మైళ్ళదూరం అయినా సరే ప్రయాణించడానికి నిశ్చయించుకున్నారు. మద్రాస్ నుంచి న్యూయార్క్ కి ప్రయాణం కట్టారు. నిజానికి ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు సూర్యకుమారి గారు విదేశాల్లోనే ఉండిపోదాం ఎప్పుడూ అనుకోలేదు. మళ్ళీ వెనక్కు వచ్చేద్దాం అనుకున్నారు. ఈ విశేషాలన్నీ తర్వాతి రోజుల్లో ఆవిడ ఇచ్చిన ఇంటర్వ్యూ ల ద్వారా తెలిసినవి. కాకపోతే, వాస్తవంలో జరిగిందేమిటంటే, మధ్యమధ్యలో తెలుగు నేలకి అతిథిగా వచ్చి వెళ్లడమే తప్ప ఆ తర్వాత 45 సంవత్సరాలూ మరణించేవరకు విదేశీ గడ్డమీదే ఉండిపోయారు సూర్యకుమారి గారు..ఇదొక విచిత్రమైన పరిణామం.

సూర్యకుమారి గారు అమెరికా వెళదాము అనుకోవడానికి ముందు మరొక రెండు సన్నివేశాలు కూడా జరిగినవి. అదేమిటంటే,ఆవిడ నటించిన చిట్ట చివరి చిత్రం రామదాసు దాని షూటింగు కూడా పూర్తి చేసేశారు. అది చాలా రోజులు షూటింగు జరిగింది కాబట్టి ఆవిడ పాత్ర మాత్రం పూర్తి చేసుకున్నారు ఒప్పందం ప్రకారం. అలాగే అమెరికా బయలుదేరబోయే కొద్దీ నెలల ముందు '12 th నైట్ 'అని ఒక నాటకంలో కూడా ఆవిడ నటించారు.ఆ నాటకం ఏమిటంటే, అమెరికా కి భారతదేశానికి మధ్యన ఉన్న సాంస్కృతిక ఒడంబడిక రూపొందించినటువంటి నాటిక. దాంట్లో కథానాయిక వయోలా పాత్ర వేశారు సూర్యకుమారి గారు. బహుశా సూర్యకుమారి గారు నటించినటువంటి ప్రథమ ఆంగ్ల నాటిక ,నాటకం ఆ '12 th నైట్' అయ్యివుంటుంది. ఆ రెండూ పూర్తి చేశాక 1959 మార్చ్ లో ఆవిడ అమెరికా కి ప్రయాణం కట్టారు.

అమెరికా వెళ్లబోయే ముందు రెండు వారాల పాటు లండన్ లో ఉందామని ముందుగానే అనుకున్న కార్యక్రమం. లండన్ రావడానికి ముందే బి.బి.సి వారితోటి ఆవిడ సంప్రదింపులు జరిపారు.ఆ సంప్రదింపుల ఫలితంగా లండన్ లో ఆగినప్పుడు బి.బి.సి లో కూడా రెండు మూడు శ్రావ్య నాటికలలో నటించారు ఆవిడ. రెండు,మూడు వారాలు కూడా లండన్ లో ఉన్నప్పుడు ఆవిడకి సహాయం చేసినటువంటి వ్యక్తి పేరు లూడి మిల్లా ప్రేమకోఫ్. అనేటటువంటి రష్యన్ యువతీ. ఈ లూడి మిల్లా ప్రేమకోఫ్ సూర్యకుమారి గారికి ఎక్కడ పరిచయం అంటే – సూర్యకుమారి గారు బొంబాయి లో 'ఉరన్ కటోలా' హిందీ సినిమాలో వేసినప్పుడు లూడి మిల్లా దానికి కళా దర్శకురాలిగా పనిచేసింది. అక్కడ సూర్యకుమారి గారికి మంచి పరిచయమయ్యారావిడ.. సూర్యకుమారి గారు లండన్ లో ఆగినప్పుడు సహాయం చేశారు. అప్పుడే కాకుండా తర్వాత రోజుల్లో కూడా ఈ లూడి మిల్లా ప్రేమకోఫ్ అన్న ఆవిడే సూర్యకుమారి గారు లండన్ లో స్థిరపడ టానికి పెద్ద సహాయం చేశారు. జీవితం ఎలా ఉంటుందో చూడండి! సూర్యకుమారి గారు 1950 ప్రాంతాల్లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో పరిచయమైనటువంటి ఆ ఫ్రాంక్ కాప్రా అనే ఆయన పరిచయం వల్ల ఆవిడకు హాలీవుడ్ వెళ్ళేటటువంటి ఆహ్వానం

లభించింది.మరి హాలీవుడ్ వెళ్ళాక అక్కడ హిచ్ కాక్ పరిచయం తోటి మళ్ళా హిచ్ కాక్ నేను పారితోషికమిస్తాను రమ్మనడంతో మళ్ళీ అమెరికా వెళ్లే అవకాశం దొరికింది.మధ్యలో ఈ లూడి మిల్లా అనేటటువంటి స్నేహితురాలి యొక్క సహాయం తోటి లండన్ లో ఉండగలిగారు. ఒక్కొక్క సారి ఒక్కొక్కరి పరిచయాలు జీవితంలో కొన్ని కొన్ని మలుపులు తిప్పుతుంటాయి. అందుకే సంబంధాలన్నింటినీ కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలని పెద్దవాళ్ళు చెబుతూ ఉంటారు.సూర్యకుమారి ఈ సన్నివేశాలన్నిటిని గమనిస్తే దాంట్లో ఎంత నిజముందో తేలుస్తుంది.

లండన్ లో ఆ రెండు మూడు వారాలు బి.బి.సి. లో అయిపోయాక ఆవిడ న్యూయార్క్ చేరుకున్నారు. మళ్ళీ కొత్త జీవితం. ఎందుకంటే, భారతదేశంలో ఆవిడ కి అన్నీ సౌకర్యములున్నాయి.నౌకర్లూ, చాకర్లూ ఉన్నారు. పెద్ద ఇల్లు, బంధుమిత్రులూ అన్నింటినీ వదులుకొని మళ్ళా ఇప్పుడు న్యూయార్క్ వచ్చాక కొత్త జీవితాన్ని మళ్ళీ పునాదుల దగ్గరినుంచి ప్రారంభించుకోవాల్సిన పరిస్థితి.న్యూయార్క్ లో ఆవిడ మాన్హాటన్ లో ఒక చిన్న రూమ్ లో ఉండేవాళ్ళు. ఆ రూమ్ లో మరొక ఇద్దరు మహిళలతోటి కలిసి ఉన్నారు. ఒకావిడ పేరు అమండా వెబ్బర్ అని ఆవిడప్పుడే న్యూయార్క్ లో నాటకాల్లో వీటిల్లో నటించడానికని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకొకావిడ పేరు రోజారియా సంతోష్ అని ఆవిడ యునైటెడ్ నేషన్స్ లో ఒక ఉద్యోగినిగా బొలీవియా నుంచి వచ్చారు. వాళ్ళిద్దరితో కలిసి గదిని పంచుకుంటూ మాన్ హాటన్ లో సూర్యకుమారి గారు మళ్ళీ కొత్త జీవితాన్ని ప్రారంభించారు 35 సంవత్సరాల వయసులో.

ఆవిడ అమెరికాలో మొట్టమొదటగా చేయాల్సిన పని హిచ్ కాక్ కి సంబంధించిన పరిశోధనలు చేయటానికి గ్రంథాలయాలకు వెళ్లడం , అవి చదవడం, ఆయనకి కావాల్సినటువంటి సమాచారాన్ని పంపించడం. ఇది జరుగుతూ ఉండగా ఆవిడ మొట్టమొదట్లో చాలా ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారట. ఈ విశేషాలన్నీ కూడా గూటాల కృష్ణమూర్తి గారు తన వ్యాసం లో రాశారు. ఆవిడకి హిచ్ కాక్ గారు పంపించే పారితోషికం కాకుండా మళ్ళా అదనంగా కూడా అవసరమైంది. అలాంటప్పుడు కొలంబియా యూనివర్సిటీ కి వెళ్లి అక్కడ భారతీయ సంగీతాన్ని , నృత్యాన్ని నేర్పడానికని ఒక ఉద్యోగం లాంటిది తెచ్చుకున్నారు. ఇటు గ్రంథాలయానికివెళ్ళి హిచ్ కాక్ సహాయం చేయడం, కొలంబియా యూనివర్సిటీ వాళ్లకు బోధించడంతో పాటుగా అక్కడ పాశ్చాత్య నృత్యాన్ని, పాశ్చాత్య సంగీతాన్ని కూడా పరిశీలించడం, అభ్యసించడం ప్రారంభించారు సూర్యకుమారిగారు. మరి వీటన్నింటికి కూడా ఆవిడ మాన్ హాటన్ నుంచి వెళ్ళాలి , చెయ్యాలి అంటే అంతా కాలినడకనే వెళుతూ ఉండేవాళ్ళట. కాలినడకనే ఆవిడ సెంట్రల్ పార్క్ కు కూడా వెళుతూ ఉండేవాళ్ళట. ఆవిడ చీరకట్టుకోవడం మానలేదు. అందరూ వింతగా చూస్తూ ఉండేవాళ్ళట. అప్పట్లో ఆవిడ ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఒక పత్రిక కి చెప్పారు "భారతదేశంలో ఉంటె నేనొక సెలెబ్రిటీని. నా చుట్టూతా అందరు వస్తుండేవాళ్లు. ఇక్కడ చాలా హాయిగా ఉంది. నన్నెవ్వరూ గుర్తుపట్టడం లేదు నా ఇష్టం వచ్చినట్లు ఎక్కడికైనా నడిచి వెళ్లిపోవచ్చు".,

అమెరికా వచ్చాక విదేశీయులతో కలిసి పనిచేస్తున్నప్పటికీ ఆవిడ భారతీయ సంస్కృతిని , భారతీయ వేదాంతాన్ని , ఆ సంప్రదాయాన్ని , ఆ కట్టుబాట్లని ఆచార వ్యవహారాలను ఏమాత్రము మర్చిపోలేదు. ఉదాహరణ ఏమిటంటే, ఆవిడ రూమ్ లో ఉన్నప్పుడు సరస్వతి, కృష్ణుడు , లక్ష్మి ఈ విగ్రహాలన్నీ పెట్టి రోజూ అగరవత్తులు వెలిగించడం, పూజ చేయడం ఇలాంటివన్నీ కొనసాగించారట, మిగతా ఇద్దరు మహిళలతో కూడా ఉన్నప్పుడు. ఖర్చులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఉన్నదానితో సరిపోక, ఆవిడ ఒకటి రెండు సార్లు నైట్ క్లబ్ లో పాటలు పాడటానికికూడా ప్రయత్నాలు చేశారు అని కృష్ణమూర్తి గారు రాశారు. అయితే ఇండియా లో చేసిన గానకచేరీలు వేరు, న్యూయార్కులో నైట్ క్లబుల్లో పాటలు పాడడమంటే ఆ పరిస్థితి వేరు. అందుకని ఒకసారి తర్వాతే ఆవిడ మళ్ళీ అటు వైపు కూడా వెళ్లదలుచుకోలేదు, ఆ ప్రయత్నాలు కూడా మానేశారట.

ఇవన్నీ గమనిస్తుంటే, బహుశా భారతదేశం నుంచి ఆవిడ ఏమీ తనతోటి ధనాన్ని తీసికెళ్ళలేదు అని తెలుస్తుంది. చిన్నప్పటినుంచి కూడా ఆవిడ □□ చాలా ఉన్నతమయినటువంటి కుటుంబం. దేనికీ ఇబ్బంది లేదు. పైగా ఆవిడకి కూడా చాలా ఆదాయం వస్తూ ఉండేది భారతదేశంలో ఉండగాను. అయినా కానీ తాను అనుకున్నది సాధించడం కోసమని, కొత్త జీవితాన్ని ప్రారంభించే ప్రక్రియలో ఈ ఇబ్బందులనన్నింటిని ఎదుర్కొంటూ ఆవిడ న్యూయార్క్ జీవితాన్ని కొనసాగించారు.

అలా ఒక సంవత్సరమయ్యింది. ఈ సంవత్సరంలో భారతదేశం నుంచి ఎంబాసిడరు లాంటివాళ్ళు వస్తే, వాళ్ళ సమక్షంలో ఈవిడ దేశభక్తి గీతాలు పాడారు. అలాగే సండే టైమ్స్ అనే పత్రికలో ఆవిడ ఇండియన్ ర్యాప్ ట్రిక్ అని చీర కట్టుకోవడం ఎలాగ అనేటటువంటి ఒక వ్యాసాన్ని కూడా రాశారు. ఆవిడ అనుకున్నటువంటి ఉద్దేశం ఏమిటంటే, ఈ నాటకాన్ని టి.వి.లోకి తీసికెళ్ళాలి , ముందు స్థాయికి తీసికెళ్ళాలి అని కదా! ఆ ప్రయత్నంలో

భాగంగా ఆవిడ సి.బి.ఎస్ వాళ్ళని సంప్రదించారు. వాళ్ళ రేడియో లో వేయడానికి శ్రావ్య నాటకంగా అయితే వేస్తాము ఈ చిత్రార్జున నాటకాన్ని అని వాళ్ళు సూర్యకుమారి గారికి అంగీకారం తెలియచేసారు. తెలుగులో ఉన్నదాన్ని ఇంగ్లీష్ లో రాయాలి కదా ! భారతదేశంలో ఉండగానే ఆవిడ ఓ స్కాటిష్ రైటర్ తోటి దీన్ని ఇంగ్లీష్ అనువాదం తర్జుమా చేయిద్దామనుకున్నారు కానీ వీలుకాలేదు. అందుకని ఆవిడ అమెరికా వచ్చి సి.బి.ఎస్ వాళ్ళు ఒప్పుకున్నాక ఆవిడే స్వంతంగా దాన్ని ఇంగ్లీష్ లో రాసి సి.బి.ఎస్ లో దాన్ని చిత్రార్జున నాటకాన్ని అంటే శ్రవ్య నాటకంగా, ఆడియో నాటకంగా దాన్ని ప్రసారం చేశారు. అది బాగా జరిగింది. దాంతోటి ఎవరో ఇండియా నుంచి ఒకావిడ వచ్చింది. సూర్యకుమారట. ఆవిడ చక్కగా నాటకం వేస్తున్నారు ఈ ఆంగ్ల ఉచ్చారణ అనే దానిలో కూడా ఏమాత్రం తేడా తెలియటం లేదు అనే విషయం కళాకారులందరికి కూడా తెలిసింది.

1961 ఫిబ్రవరి లో ఒక ప్రదర్శనకని ఏర్పాట్లన్నీ జరిగినవి. ఆ రవీంద్రనాథ్ ఠాగూర్ గారి శత జయంతి ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి భారతీయులందరూ కూడా దాన్ని నిర్వహించుకుంటున్నారు.ఆ సందర్భంలో కృష్ణ షా అనేఆయన న్యూయార్క్ లో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన కింగ్ ఆఫ్ ది డార్క్ చాంబర్ అనే నాటకాన్ని నృత్య నాటకంగా ప్రదర్శించాలి అని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లు చేస్తున్న రోజుల్లోనే సూర్యకుమారి గారు సి.బి.ఎస్ లో వేసినటువంటి చిత్రార్జున నాటకాన్ని విన్నాక ఆయన సూర్యకుమారి గారిని సంప్రదించి " కింగ్ ఆఫ్ ది డార్క్ చాంబర్ అనే నాటకంలో మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ నటించాలి" అని అడిగారు. ఆవిడ కూడా అవకాశాలకోసం చూస్తున్నారు కాబట్టి ఆవిడ వెంటనే ఒప్పుకున్నారు. ఆ నాటకంలో ఆవిడ వేసిన పాత్ర సుదర్శన రాణి. కింగ్ ఆఫ్ ది డార్క్ చాంబర్ అనేది కొంచెం ప్రతీకాత్మకంగా ఉంటుంది. అంటే,మంచి, చెడు సమాజంలో ఉండేవి, మధ్యలో నలిగిపోయే వాళ్ళు ఇలా ఉంటుందన్నమాట. ఆ నాటకాన్ని మొట్టమొదటి సారిగా 1961 ఫిబ్రవరి లో జాన్ హస్ థియేటర్ లో ప్రదర్శించారు.అది బ్రాడ్ వే కాదు ఆఫ్ బ్రాడ్ వే అంటారు. అక్కడ మొట్టమొదటి సారి ప్రదర్శించినప్పుడే సూర్యకుమారి గారి నటన కానీ , ఆవిడ స్వరం కానీ , ముఖకవళికలు కానీ ప్రేక్షకుల్ని కట్టిపడేసినవట. అలా ప్రారంభించిన కింగ్ ఆఫ్ ది డార్క్ చాంబర్ నాటకం, అది మొదటి ప్రదర్శన మాత్రమే కాదు అక్కడి నుంచి ప్రారంభించి వారానికి ఎనిమిది ప్రదర్శనల చొప్పున దాదాపుగా పది నెలలపాటేమో ప్రదర్శించారు. అంటే 250 ప్రదర్శనలు పైగా ప్రదర్శించారు. అంటే ప్రతి రోజు కూడా ఒక నాటకం , అలాగే వారాంతంలో రెండు సార్లు వెయ్యాలి. నాటకం ప్రతి ప్రదర్శనకు వెళ్ళబోయేముందు పావుగంట ధ్యానం చేసి అప్పుడు వేదిక మీదకు వెళ్ళేవాళ్ళట. ఈ నాటకం గురించి "ఈ సూర్యకుమారి అనే నటీమణి మహారాణి వేషంలో వేదిక మీదకు రాగానే ప్రేక్షకులందరూ కూడా ఒకరకమైనటువంటి విభ్రాంతికి , విస్మయానికి లోనవుతూ ఉండేవాళ్ళు , ఎందుకంటే ఆవిడ మొహంలో ఉన్నటువంటి కళకానీ , ఆవిడ మాటల్లో ఉన్నటువంటి గంభీరత కానీ ప్రేక్షకులందరినీ కూడా ఇంకోలోకంలోకి తీసికెళ్లింది"ని లైఫ్ మాగజైన్ లో రాశారు అప్పట్లో. ఈ నాటకం సూర్యకుమారి గారిని అమెరికాలో మళ్ళీ ప్రసిద్ధమై నటీమణి గా చేశాయి. అంటే ఆవిడ ఇండియా లో ఎలాగైతే సెలెబ్రెటీగా ఉన్నాను అందరూ గుర్తుబట్టేవాళ్ళు అన్నారో ఆ సెలెబ్రిటీ హోదా అమెరికా వచ్చాక రెండు సంవత్సరాల్లోనే ఆవిడకి మళ్ళీ వచ్చేసింది. ఎక్కడికి తీసికెళ్ళిందంటే – బ్రాడ్ వే నాటకాలు,హాఫ్ బ్రాడ్ వే నాటకాలు అని ఉంటాయి. హాఫ్ బ్రాడ్ వే లో ఈ నాటకం పది నెలల పాటు కొనసాగాక 1960 – 61 ఆ సంవత్సరాలకు కాను O .B .I .E . బహుమతులు అని ఉంటాయి. O .B .I .E అవార్డుల్లో ఉత్తమ నటీమణులుగా ముగ్గుర్ని ఎంపిక చేస్తే ఆ సంవత్సరంలో ప్రదర్శించినటువంటి నాటకాలన్నింటిలోను అందులో సూర్యకుమారి గారు ఒకరు. ఇప్పటికికూడా అంతర్జాలంలో కి వెళ్లి O .B .I .E . అవార్డులు వెతికితే గనక 1960 –61 లో ఈ కింగ్ అఫ్ ది డార్క్ ఛాంబర్ సూర్యకుమారి అని ఉంటుంది.అది ఆవిడ అతి స్వల్ప కాలంలోనే అమెరికాలోకూడా రంగస్థలం మీద కూడా తెచ్చుకున్నటువంటి అత్యద్భుతమైనటువంటి పేరు.ద ఈ నాటకం గురించి రాస్తూ లైఫ్ మాగజైన్ లో పూర్తి స్థాయి వర్ణచిత్రాన్ని వేశారు సూర్యకుమారి గారు అలాగే పక్కన వేర్ పాత్రలో ఉన్నటువంటి నటులతోటి. సూర్యకుమారి గారి మొహం మాత్రమే అందులో ప్రముఖంగా కనిపిస్తూ ఉంటుంది. లైఫ్ మాగజైన్ 1961 జూన్ 9 వ సంచికలో పూర్తి స్థాయి వర్ణచిత్రాన్ని ప్రచురించారు. ఆ విధంగా లైఫ్ మాగజైన్ లో ప్రతిష్టాత్మకమైన టువంటి ఆ పత్రికలో పూర్తి స్థాయి వర్ణచిత్రం ప్రచురించబడిన మొట్టమొదటి, బహుశా చిట్ట చివరి కూడా అయిఉంటుందేమో కాని తెలియదు, మొట్టమొదటి తెలుగు వనిత టంగుటూరి సూర్యకుమారిగారు.

కృష్ణ షా అనే ఆయన ఈ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించాక దాన్ని సౌత్ ఆఫ్రికాలో కూడా ప్రదర్శించాలి అనే ఉద్దేశం తో, ఇంతమంది నటీనటుల్ని తీసికెళ్ళకుండా భాస్కర్ అనే ఒక నటుణ్ని , సూర్యకుమారి గార్ని మాత్రమే తీసికొని వెళ్లి అక్కడ ఆఫ్రికా లో ఉన్న స్థానిక కళాకారుల్ని , అక్కడున్న భారతీయ కళాకారుల్ని కూడా తీసికొని నాలుగు నెలల పాటు ప్రదర్శించారు.ఆ విధంగా సూర్యకుమారి గారు నాటకరంగంలోకి వెళ్ళాక కూడా

మొట్ట మొదటి రెండు సంవత్సరాల్లోనే ఆంత పేరు తెచ్చుకొని అమెరికా లో హాఫ్ బ్రాడ్ వే లోను , అలాగే సౌత్ ఆఫ్రికా లోనూ కూడా ప్రదర్శించారు.సౌత్ ఆఫ్రికా లో కేప్ టౌన్ ,మాయనార్డ్ విలే ఇలాంటి ఉళ్ళంటిలో కూడా ఈ నాటకాన్ని ప్రదర్శించి అక్కడ కూడా అత్యద్భుతం అనే పేరు తెచ్చుకున్నారు.

ఆ తర్వాత సూర్యకుమారి గారి జీవితం మరొక మలుపు తిరిగింది. ఆ మలుపు తిరగడానికి ఒక కారణం కూడా ఉంది, బలీయమైన కారణం!! ఆ కారణం ఏమిటి? ఆ మలుపు ఏమిటి? ఆ తర్వాత లండన్ లో ఆవిడ జీవితం ఎలా కొనసాగింది? ఈ విశేషాలు వచ్చేభాగం, టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన ప్రత్యేక కార్యక్రమం నాలుగవ భాగం చివరి వారంలో తెలుసుకుందాం.

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొద్దు సత్యనారాయణ)**

(సశేషం)

★★★

2018 ఏప్రిల్ 17 న ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS